లాకుల ఆధునీకరణ చేయకుంటే ఎలా?

- శిథిలావస్థకు చేరిన లాక్ చాంబర్లు
- పట్టించుకోని ఇరిగేషన్ శాఖ

ఆలమూరు: రైతులకు అత్యంత ఉపయోగకరమైన నీటి పారుదల వ్యవస్థపై అధికారులు అవలంబిస్తున్న ఉదాసీన వైఖరి వల్ల భవిష్యత్‌లో వేలాది ఎకరాలకు నీరందని పరిస్థితి తలెత్తే ప్రమాదముంది. ఖరీఫ్ సీజన్‌లో అసలే నీటి ఎద్దడితో కొట్టుమిట్టాడుతున్న రైతులకు లాకుల వల్ల లీకేజీ అవుతున్న నీరు వృథాగా పోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కొత్తపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సుమారు 32 వేల ఎకరాల వరిసాగు జరుగుతుంది. వీటికి ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ ఆనకట్ట నుంచి మూడు ప్రధాన కాలువల ద్వారా ఆయకట్టుకు నీరందుతుంది. బ్రిటిష్ ప్రభుత్వ హయాంలోనే సాగునీటి వ్యవస్థ నియంత్రణకు నియోజకవర్గంలోని ఆరు చోట్ల లాకులను ఏర్పాటు చేశారు. ఆలమూరు మండలంలోని ఆలమూరు, చొప్పెల్ల, కొత్తపేట మండలంలోని పలివెల, వాడపాలెం, రావులపాలెం మండలంలోని గోపాలపురం, ఆత్రేయపురం మండలంలోని లొల్ల వద్ద లాకులు నిర్మించారు. వీటిని నిర్మించి శతాబ్ద కాలం పూర్తయినా ఆధునీకరించకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. ఆలమూరు లాకుల వద్ద లాక్ చాంబర్ (పడవలు వెళ్లే) మార్గం తలుపులు పూర్తిగా దెబ్బతినడంతో పెద్ద పెద్ద రంధ్రాలు ఏర్పడ్డాయి. దీనివల్ల లీకుల ఏర్పడి నీరు వృథాగా బయటకు పోతుంది. ఎడమవైపు గోడ ఒరిగిపోవడంతో ఇరిగేషన్ సిబ్బంది ఇసుక బస్తాలు వేసి లీకేజీలు లేకుండా చేయగలిగారు.


చొప్పెల్ల లాకుల వద్ద లీకవుతున్న సాగునీరు

తీవ్రమవుతున్న నీటి ఎద్దడి

రబీ సాగుకు నీటి ఎద్దడి వస్తుందని అధికారులు చెబుతున్నా ఆ మేరకు నివారణ చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. మండలంలోని వివిధ లాకులకు సత్వరమే దీర్ఘకాలిక మరమ్మతులు చేపట్టకపోతే కోరంగి కాలువ వెంబడి సాగు చేస్తున్న వందలాది ఎకరాలు నీటి ఎద్దడిని ఎదుర్కొనే ప్రమాదముంది. అలాగే చొప్పెల్ల లాకుల కింద మండలంలోని పది గ్రామాల్లో సుమారు 11 వేల ఎకరాలు సాగవుతుంది. తూర్పు డెల్టా కాలువకు అత్యంత ప్రధానమైన ఈ లాకులపై కూడా అధికారులకు చిన్నచూపే ఎదురవుతుంది. ఈ లాకుల వద్ద దాదాపు తలుపులన్నీ తీవ్రంగా దెబ్బతిన్నాయి. లాకుల వద్ద అధిక శాతం నీరు లీకేజీ అవడంతో పాటు వియర్ లాకు, లాక్ చాంబర్ తలుపులు పుచ్చుపట్టాయి. ఏ సమయంలో కూలుతాయోనని ఇరిగేషన్ సిబ్బందే భయపడే పరిస్థితి నెలకొంది.

లీకేజీలను అరికట్టాలి

తూర్పు డెల్టా ప్రధాన కాలువ ఆధునీకరణలో భాగంగా లాకులను ఆధునీకరించేందుకు 2008లో అప్పటి ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి రూ.మూడు కోట్ల నిధులను కేటాయించారు. నిపుణుల బృందం లాకులను పరిశీలించి మరమ్మతులకు సూచనలిచ్చింది. వైఎస్ మరణం తరువాత మాజీ సీఎం వైఎస్ జగన్ హయాంతో మాత్రమే కనీస మరమ్మతులు చేపట్టారు, ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు అనేక చోట్ల చాంబర్ లాకులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అలాగే నియోజవర్గంలోని మిగతా లాకుల పరిస్థితి కూడా ఇలానే ఉంది. దీనివల్ల కాలువల శివారు గ్రామాలకు భవిష్యత్‌లో సక్రమంగా నీరందక ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో ఇరిగేషన్ సిబ్బంది లాకుల వద్ద నీటి మట్టం నిలిపేందుకు నానా హైరానా పడుతున్నారు. ఈ లాకుల వద్ద లీకేజీలను అరికడితే అదనంగా మరో 20 వేల ఎకరాలను అదనంగా నీటిని అందించవచ్చని సాగునీటి రంగ నిపుణులు చెబుతున్నారు. ఇకనైనా అధికారులు సత్వరమే స్పందించి లాకులకు శాశ్వత ప్రతిపాదికన మరమ్మతులు చేపట్టి రైతుల ప్రయోజనాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం



పంట పొలాలకు సాగునీరు అందించే లాకుల వద్ద ఇరిగేషన్ సిబ్బంది ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఉన్నతాధికారుల వద్దకు తీసుకువెళ్లాం. ఇప్పటికే తీసుకోవలసిన చర్యలపై రూపొందించిన నివేదికను అందజేశాం. అనుమతులు రాగానే పనులను ప్రారంభిస్తాం.

– కృష్ణ త్రిమూర్తులు, ఇరిగేషన్ జేఈ, ఆలమూరు

క్లుప్తంగా

మొక్కలతోనే పర్యావరణ భవిష్యత్


గంగలకుర్రులో మొక్క నాటుతున్న సర్పంచ్ శ్రీనివాసరావు

అంబాజీపేట: కాలుష్యంతో వాతావరణం నిండిపోతున్న నేటి తరుణంలో మొక్కలే భవిష్యత్‌లో పర్యావరణాన్ని కాపాడతాయని సర్పంచ్ కాండ్రేగుల శ్రీనివాసరావు అన్నారు. గంగలకుర్రులో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శి ఎస్.సత్యవేణి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. సర్పంచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ అమ్మ మనకి జన్మనిచ్చినట్లగానే, భవిష్యత్‌లో మొక్కలు మన ప్రాణాలను కాపాడి మరో జన్మనిస్తాయన్నారు. స్వచ్ఛతాహి సేవా ర్యాలీని నిర్వహించారు. అనంతరం అమ్మపేరుతో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నెల్లి ఏడుకొండలు, గ్రామస్తులు అధికారపు బాబ్జి, అరిగెల రామచంద్రరావు, నెల్లి చిన వెంకటేశ్వరరావు, యర్రంశెట్టి భద్రం తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశుని ఆలయానికి పోటెత్తిన భక్తులు


వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు


అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితుల స్వామికి తులసి పూజ చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామికి పటిక బెల్లం తులాభారంగా సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

విద్యార్థికి ఆర్థిక సాయం


ఆర్థికసాయం అందిస్తున్న సర్పంచ్, ఉపాధ్యాయులు

రాజోలు: అనారోగ్యంతో చికిత్స పొందుతున్న నాలుగో తరగతి విద్యార్థికి కడలి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు రూ.39,800 ఆర్థిక సాయాన్ని శనివారం అందజేశారు. కడలి నం.3 ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థి వడ్డి ఆరోగ్యరాజ్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చికిత్స నిమిత్తం ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విద్యార్థికి ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆర్థిక సాయం చేయడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీపాద సుందరశర్మ, సర్పంచ్ చొప్పల గుణనాథ్, నాయకులు మేడిద కిషోర్, వడ్లమూడి ప్రకాశరావు, బత్తిన సత్యం, మేడిద మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీకాంత్‌కు ఉత్తమ సేవా పురస్కారం


అవార్డు అందుకుంటున్న శ్రీకాంత్

ఆత్రేయపురం: మండలంలోని బొబ్బర్లంక సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బళ్ల శ్రీకాంత్ జిల్లా స్థాయి ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవా పురస్కారాన్ని అందుకున్నారు. పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎండీ అలీముల్లా చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆనంద్‌రాజు, అసిస్టెంట్ ఇంజినీర్ డి.వీరభద్రరావు, ఎంపీడీఓ నాతి బుజ్జి అభినందించారు.

ఇంటింటికీ బ్రోచర్ పంపిణీ

ఆలమూరు: రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తవడంతో మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈనెల 26వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమంలో భాగంగా వంద రోజుల్లో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై ఇది మంచి ప్రభుత్వం రూపొందించిన బ్రోచర్‌ను కూటమి నాయకులు ఇంటింటికీ అందజేశారు.

లడ్డూ ప్రసాదంపై అపోహలు తొలగించాలి


రాజోలు తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న వీహెచ్‌పీ నాయకులు

రాజోలు: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంపై ప్రపంచ వ్యాప్తంగా భక్తులకు ఎంతో విశ్వసనీయత ఉందని ఆ ప్రసాదంపై వస్తున్న అపోహలను తొలగించాలని శనివారం తహసీల్దార్ ఎస్ఎస్ఎస్ ప్రసాద్‌కు విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. లడ్డూ ప్రసాదం తయారీలో జంతువుల కొవ్వు పదార్థాలు ఉన్నాయని, అటువంటి నెయ్యిని సరఫరా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్‌లో అలాంటివి జరగకుండా చూడాలని, ముఖ్యంగా లడ్డూ ప్రసాదం విశిష్టత కోల్పోకుండా భక్తులకు విశ్వాసాన్ని పెంపొందించే విధంగా టీటీడీ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా, వీహెచ్‌పీ నాయకులు పాల్గొన్నారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: నగరం గ్రామంలో 216వ నంబర్ జాతీయ రహదారిపై కూటమి నేతలు శనివారం ధర్నా చేశారు. తిరుపతి మహా ప్రసాదాన్ని అపవిత్రం చేశారని ఆరోపిస్తూ ఈ ఆందోళన నిర్వహించారు. మాజీ సీఎం, అప్పటి దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ధర్నాలో భాగంగా జగన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ అంశంపై సీబీఐ విచారణ జరిపించి దీనికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సర్పంచ్ జాలెం రమణకుమారి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

చిన్నారుల సంరక్షణకు టీకాలు తప్పనిసరి


పినపళ్లలో చిన్నారులకు టీకాలు అందిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

ఆలమూరు: చిన్నారుల ఆరోగ్య సంరక్షణం కోసం టీకాలు తప్పనిసరని కొత్తపేట అడిషనల్ డీఎంహెచ్ఓ ఎం.సుమలత అన్నారు. జిల్లా వైద్యారోగ్య ఆదేశాల మేరకు పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల పరిధిలోని మండలంలోని వివిధ గ్రామాల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది చిన్నారులకు ప్రత్యేక టీకాల శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్యాధికారులు పి.భవానీ శంకర్, ఆర్.మల్లికార్జున్, డి.సువర్చలాదేవి, డి.సాయి కిషోర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాలను శనివారం కొత్తపేట అడిషనల్ డీఎంహెచ్ఓ సుమలత పరిశీలించారు. చిన్నారులకు ఏ విధమైన అంటువ్యాధులు దరిచేరకుండా ఎల్లప్పుడూ ప్రాణపాయస్థితి నుంచి కాపాడేందుకు వీలుగా ధనుర్వాతం, కామెర్లు, క్షయ, పోలియో, డిఫ్తీరియా, కోరింత దగ్గు నివారణకు పెంటావాలెంట్, ఎంఆర్, టీటీ, డీపీటీ, హెపటైటిస్–బీ వ్యాక్సిన్లను నిర్ణీత సమయాల్లో అందించాలని సూచించారు. ఈ టీకాల ప్రక్రియను ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెచ్ఈలు బి.సూర్యనారాయణ ఏవీవీ రాజా అక్కుల పర్యవేక్షించారు. సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి ఎంఎల్‌హెచ్‌పీలు ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వచ్ఛతాహి సేవపై మహిళల ర్యాలీ


ముక్తేశ్వరం సెంటర్‌లో స్వచ్ఛతాహి సేవపై అవగాహన కల్పిస్తున్న డ్వాక్రా మహిళా సంఘ నాయకులు


అంతర్వేదిపాలెంలో పారిశుధ్య కార్మికులకు కిట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ లీలావతి

అయినవిల్లి: స్వచ్ఛభారత్, స్వచ్ఛతాహి సేవలో భాగంగా ముక్తేశ్వరం సెంటర్‌లో డ్వాక్రా మహిళా సంఘాల ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి అయినవిల్లి ప్రధాన కూడలి వరకు ప్రజలకు పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రజలకు అవగాహన కల్పిస్తూ ముక్తేశ్వరం నాలుగు రోడ్ల కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. అందరి భాగస్వామ్యంతోనే స్వచ్ఛ అయినవిల్లి సాధ్యపడుతుందని ఎంపీడీవో టి.వెంకటాచార్య అన్నారు. మండల మహిళా సంఘాల నాయకులు బాధ్యత తీసుకొని స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌కు సహకరించాలని ఆయన కోరారు. ర్యాలీలో డీఆర్డీఏ, వెలుగు ఏపీఎం ఎం.వెంకటేశ్వరరావు నేతృత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ పి.శ్రీనివాసు, ఈవోపీఆర్డీ వాణికుమారి బెహ్రాన్, మండల సమాఖ్య అధ్యక్షురాలు కె.సత్యాదేవి, సీసీఎం దుర్గా, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుకుందాం

అంబాజీపేట: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుకుందామని సర్పంచ్ కోట బేబీరాణి అన్నారు. చిరతపూడిలో సర్పంచ్ బేబీరాణి అధ్యక్షతన స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలన్నారు. అనంతరం తల్లికి వందనం పేరుతో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలు చేపట్టినట్టు ఎంపీడీవో పీవీ సత్యనారాయణ తెలిపారు. గొందిలో ఇంటింటికీ స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంపై అవగాహన కల్పించారు. సర్పంచ్ డి.రవికుమార్, ఉపసర్పంచ్ బాబ్జీ, కార్యదర్శి ఎ.గంగరాజు పాల్గొన్నారు. టేకిశెట్టిపాలెంలో సర్పంచ్ పోతు దేవీదుర్గ ఆధ్వర్యంలో ఇంటింటికీ ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను సిబ్బంది పంపిణీ చేశారు. ఆయా గ్రామాలలో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ల వద్ద పారిశుధ్య పనులు నిర్వహించారు. అంతర్వేదిపాలెంలో సర్పంచ్ నల్లి లీలావతి పారిశుధ్య కార్మికులకు అవసరమయ్యే కిట్లను పంపిణీ చేశారు.


అంతర్వేది బీచ్‌లో నిర్వహిస్తున్న స్వచ్ఛసాగర్, సురక్షిత సాగర్

బీచ్‌లో స్వచ్ఛ సాగర్, సురక్షిత సాగర్

సఖినేటిపల్లి: అంతర్వేది బీచ్‌లో శనివారం నేషనల్ కోస్టల్ క్లీనింగ్ డే పురస్కరించుకుని సభ్యులు, గ్రామస్తులు స్వచ్ఛ సాగర్, సురక్షిత సాగర్ నిర్వహించారు. బీచ్‌లో వ్యర్థ పదార్థాలను, ప్లాస్టిక్ వస్తువులను సేకరించారు. సేకరించిన వాటిని ట్రాక్టర్‌లో నింపి ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డుకు చేరవేశారు.

అభియోగాలపై విచారణ


ఎల్.గన్నవరంలో ఫీల్డ్ అసిస్టెంట్‌పై వచ్చిన అభియోగాలపై విచారణ నిర్వహిస్తున్న మల్లికార్జునరావు

పి.గన్నవరం: ఎల్.గన్నవరంలో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌పై వచ్చిన అభియోగాలపై డ్వామా ఏపీడీ జీవీకే మల్లికార్జునరావు శనివారం బహిరంగ విచారణ చేశారు. ఎటువంటి వివాదాలు జరగకుండా ఎస్సై బి.శివప్రసాద్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఫీల్డ్ అసిస్టెంట్ సరెళ్ల సుబ్బరాజు అక్రమాలకు పాల్పడ్డాడని జనసేన ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, గ్రామ సర్పంచ్ పసలపూడి రామకృష్ణలతో పాటు మరికొంత మంది ఇటీవల అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో పి.శాంతమ్మ ఇంటి నుంచి సీహెచ్ జోగేశ్వర రావు తోట వరకూ రూ.2.5 లక్షలతో మట్టి రోడ్డు వేయకుండా, రోడ్డు వేసినట్టు రికార్డు చేసి నిధులు అపహరించారని వారు ఆరోపించారు. అలాగే సచివాలయం వద్ద 60 కొబ్బరి మొక్కలు నాటినట్టు చెప్పారని, అక్కడ మొక్కలు లేవని, కూలీలకు మస్టర్ల విషయంలో కూడా అక్రమాలు జరిగాయని, పనుల వివరాలు గోప్యంగా ఉంచుతున్నారని వారు అధికారులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఏపీడీ మల్లికార్జునరావు విలేఖరులతో మాట్లాడుతూ విచారణ పూర్తయిన అనంతరం జిల్లా కలెక్టర్, డ్వామా పీడీలకు నివేదికను సమర్పిస్తామని తెలిపారు. ఎంపీడీఓ ఎం.భారతి, ఏపీఓ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కూరగాయల షాపు వద్ద సెల్‌ఫోన్ చోరీ

మామిడికుదురు: కూరగాయలు కొంటున్న పాశర్లపూడికి చెందిన ఉప్పే బాలాజీకి మస్కా కొట్టి అతని జేబులోని సెల్‌ఫోన్ చోరీ చేసిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. ఉదయం కూరగాయలు కొనేందుకు బాలాజీ పాశర్లపూడి మార్కెట్‌కు వచ్చారు. కూరగాయలు కొంటుండగా ఇద్దరు అపరిచిత వ్యక్తులు అక్కడకు వచ్చారు. కూరగాయలు కొంటున్నట్టు నటించి మీ వంకాయలు కింద పడిపోయాయని బాలాజీని నమ్మించారు. అతడు వంకాయల తీసుకోడానికి ప్రయత్నించగా అతని జేబులో నుంచి చాకచక్యంగా సెల్‌ఫోన్ చోరీ చేశారు. బాధితుడు బాలాజీ దీనిపై నగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొత్త మొబైల్ ఫోన్ అని, దాని విలువ రూ.15 వేలు ఉంటుందని బాధితుడు వాపోయాడు.

పోస్టాఫీసు ప్రహరీ నిర్మాణంపై ఫిర్యాదు

రాజోలు: రాజోలులో నూతనంగా నిర్మిస్తున్న హెడ్ పోస్టాఫీసు ప్రహరీ నిర్మాణంపై శనివారం తహసీల్దార్‌కు స్థానిక నాయకులు ఫిర్యాదు చేశారు. పోస్టాఫీసు ప్రహరీని పంచాయతీ రోడ్డు మార్జిన్ లేకుండా చేయడమే కాకుండా నిర్మాణంతో పంచాయతీ తాగునీటి పైప్‌లైన్ ప్రహరీ లోపల ఉండిపోతుందన్నారు. పోస్టాఫీసుకు వచ్చే అనేక మంది తమ వాహనాలను రోడ్డుపై నిలిపివేస్తారని, దీంతో స్థానికులకు రాకపోకలకు అంతరాయం కలుగుతుందని ఆరోపించారు. ప్రహరీ నిర్మాణంపై విచారణ చేయాలని, స్థానికులకు, పోస్టాఫీసుకు వచ్చే ఖాతాదారులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుకోవాలని తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వినతిపత్రాన్ని డీటీ శ్రీనివాస్‌కు అందజేశారు. వార్డు సభ్యులు దారపురెడ్డి బాబ్జి, నామన షణ్ముఖ్ తదితరులు పాల్గొన్నారు.

శనైశ్చరునికి తైలాభిషేకాలు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామిని శనివారం అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించి, ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు జరిపించారు. ఈఓ, ఏసీ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో భక్తుల పూజలకు ఏర్పాట్లు చేశారు. భక్తుల పూజలు, తైలాభిషేకాల టికెట్ల ద్వారా దేవస్థానానికి రూ.1,36,120, అన్నప్రసాదం విరాళాల రూపంలో రూ.32,810తో మొత్తం రూ.1,68,930 ఆదాయం వచ్చినట్టు ఏసీ అండ్ ఈఓ తెలిపారు.

వందరోజుల ఆర్భాటం

అంబాజీపేట: మండలంలోని నందంపూడిలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ శుక్రవారం ప్రారంభించారు. 100 రోజుల అనంతరం ఇంటింటికీ తిరిగి పార్టీ స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వడ్లమాని పద్మావతి, ఎస్.రాంబాబు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు పరామర్శ

ఆత్రేయపురం: మండలంలోని పలువురు మృతి చెందడంతో వారి కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే పరామర్శించారు. ఆత్రేయపురానికి చెందిన కాకి శ్యామలరావు, కొండేటి జాన్‌లు మృతి చెందడంతో వారి కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పరామర్శించారు. ఆయన వెంట చిలువూరి రామకృష్ణంరాజు, పచ్చిమట్ల రాజగోపాలరాజు, చేకూరి కృష్ణంరాజు, ఎం.రామకృష్ణంరాజు, ఎంపీటీసీ సరెళ్ల ధనలక్ష్మి ఉన్నారు.

చెరువును తలపిస్తున్న హైస్కూల్ ప్రాంగణం


అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో నిలిచిన వర్షపు నీరు

అంబాజీపేట: కొద్దిపాటి వర్షానికే అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ ప్రాంగణం చెరువును తలపించడంతో విద్యార్థులకు అసౌకర్యంగా మారింది. గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి హైస్కూల్‌లో నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో నిల్వ ఉండిపోయింది. శనివారం ఉదయం పాఠశాలకు వెళ్లిన విద్యార్థులు ఆ మురుగు నీటిలో నడవల్సిన పరిస్థితి నెలకొంది. హైస్కూల్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నానని చెప్పిన వ్యక్తి నీరు నిల్వ ఉండకుండా ఎందుకు చర్యలు తీసుకోలేదని క్రీడాకారులు, స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నియోజకవర్గ స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సఖినేటిపల్లి: అంతర్వేదికర జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల హెచ్‌ఎం పి.సోమ సూర్యకుమారి శనివారం చెప్పారు. అంతర్వేదిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్పోర్ట్స్ మీట్‌లో ప్రతిభ చూపారన్నారు. కాగా కబడ్డీ టీంకు ఆరుగురు, వాలీబాల్ టీంకు తొమ్మిది మంది, ఖోఖో టీంకు ఐదుగురు ఎంపికైనట్టు పీడీ కె.భాస్కరరావు అన్నారు. కాగా ఎంపికైన విద్యార్థులకు పీఎంసీ చైర్మన్ పి.నాగేంద్ర కుమార్, ఎస్ఎంసీ చైర్మన్ అడబాల శ్రీరాములు, సర్పంచ్ పోతురాజు కిషోర్‌కుమార్ అభినందనలు తెలిపారు.

కిక్కిరిసిన అప్పనపల్లి

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామివారి ఆలయం శనివారం కోలాహలంగా మారింది. స్వామివారి దర్శనానికి భారీగా భక్తులు తరలివచ్చారు. గోవిందా.. హరి గోవింద... అంటూ స్వామి వారి ఆలయం చుట్టూ ఏడు ప్రదక్షిణలు చేశారు. పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. స్వామివారికి వివిధ సేవల ద్వారా రూ.2,14,403 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ వి.సత్యనారాయణ తెలిపారు. లడ్డూ ప్రసాదం, దర్శనం టికెట్ల విక్రయం ద్వారా రూ.1,46,313, నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.68,090 విరాళాలుగా అందించారన్నారు. 4,093 మంది భక్తులు రాగా, 2,581 మంది స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారన్నారు. అజ్జరానికి చెందిన అద్దేపల్లి త్రిమూర్తులు వరప్రసాదరావు, సుబ్బలక్ష్మి దంపతులు స్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.10 వేలు విరాళంగా సమర్పించారు.

నిరుపేద వైద్యానికి సాయం

మలికిపురం: మండలం కత్తిమండలో నిరుపేద కుటుంబానికి చెందిన గుబ్బల మల్లేశ్వరరావు వైద్యం కోసం దాతలు ఆర్థికసాయం అందించారు. గత కొంతకాలం క్రితం నుంచి బోన్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడని, ఆర్థికంగా ఇబ్బంది పడుతూ వైద్యం కూడా చేయించుకోలేని స్థితిలో ఉన్నాడని సంస్థ స్థానిక సభ్యుడు చెల్లుబోయిన సుబ్రహ్మణ్యం గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవా సంస్థకు తెలియజేయడంతో ట్రీట్‌మెంట్ నిమిత్తం సంస్థ సభ్యులు సమకూర్చిన రూ.38,500ను సంస్థ సభ్యులు, గ్రామపెద్దల సమక్షంలో శనివారం అందజేశారు. అధ్యక్షుడు కట్టా భాస్కర్, సంస్థ అకౌంటెంట్ గుబ్బల శ్రీనివాస్, సభ్యులు బైరిశెట్టి వెంకటరమణ, కట్టా శివ, కడలి రాంబాబు, కడలి శ్రీనివాస్ బొంతు గోపాలకృష్ణ పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు చేయించాలి

అంబాజీపేట: మండలంలోని ప్రతి పోలింగ్ బూత్‌కు సంబంధించి అధిక మొత్తంలో పార్టీ సభ్యత్వాలు నమోదు చేయించాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ చీకురుమిల్లి వెంకటేశ్వరరావు అన్నారు. కముజువారిలంకలో బీజేపీ సభ్యత్వ ప్రముఖ్, శక్తి కేంద్ర ప్రముఖ్‌లతో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. సభ్యత్వ నమోదును వేగవంతంగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ గనిశెట్టి వెంకటేశ్వరరావు, మండల ఇన్‌చార్జి కె.శ్రీనివాస్, సభ్యత్వ ప్రముఖ్ వర్మ, సుబ్బారావు, కనకరాజు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

అయినవిల్లి: మండలంలోని కె.జగన్నాథపురంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామంలో జ్వరపీడితులు ఎక్కువగా ఉండటంతో పంచాయతీ అధికారులు తక్షణ చర్యగా బ్లీచింగ్, ఫాగింగ్, ఎబేట్ స్ప్రే వంటి చర్యలు చేట్టారు. దోమ లార్వా నివారణకు మురికిగుంతల్లో ఆయిల్‌బాల్స్ వేశారు. ఇంటి పరిసరాల్లో దోమ లార్వా వృద్ధి చెందకుండా నివారణకు అవగాహన కల్పించారు. గ్రామంలో పేరుకుపోయిన చెత్తకుప్పలను తొలగించారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ మేడిశెట్టి ఉషారాణి, పంచాయతీ సిబ్బంది కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఎంఈఓ-1గా భమిడిపాటి

ఆలమూరు: మండల విద్యాశాఖాధికారి–1గా కొత్తూరు ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భమిడిపాటి అప్పాజీ నియామకం జరిగింది. ఈ మేరకు ఆర్జేడీ జి.నాగమణి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఎంఈఓ–1 గా పనిచేసిన పి. షాలెంరాజు ఆగస్టు 31న ఉద్యోగ విరమణ చేయడంతో అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగా ఉంది. మండలంలోని అన్ని పాఠశాలల్లో సమగ్రమైన విద్యను అందించి విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతానని ఎంఈఓ–1 నియమితులైన భమిడిపాటి భరోసా నిచ్చారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

సఖినేటిపల్లి: ప్రతి గ్రామంలోని ప్రజాసమస్యల పరిష్కారానికి తగిన కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు పిలుపునిచ్చారు. శనివారం గొందిలో పార్టీ నాయకుడు నల్లి బుజ్జిబాబు అధ్యక్షతన రాజోలు నియోజకవర్గ సీపీఐ సమావేశం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి సత్తిబాబు మాట్లాడుతూ, ఇందుకు విధిగా గ్రామ స్థాయిలో పార్టీ సమావేశాలు నిర్వహించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కాగా గ్రామాల వారీగా పార్టీ సమావేశాల కోసం సఖినేటిపల్లి, మలికిపురం, రాజోలు, మామిడికుదురు మండలాల్లో నిర్వహించాల్సిన తేదీల షెడ్యూల్‌ను నియోజకవర్గ కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్ విడుదల చేశారు. కౌలు రైతు సంఘ రాష్ట్ర ప్రతినిధి చెల్లుబోయిన కేశవశెట్టి, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.